రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.35	ఉ. 4.51

ఉపవాసం పాటించు దానికి మించిన సదాచారణ మరొకటి లేదు





వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

ఏసీబీకి పట్టుబడిన మండల అధికారులు

- సర్వీస్ బుక్కు బదిలీ కోసం రూ.10 వేల డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు ఏపీవో బాగయ్య
- ఇద్దరిని రిమాండ్ చేశాం : ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్



కమ్మర్‌పల్లి, మార్చి 26: మండల పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం దాడులు జరిపారు. ఎంపీవో బాగయ్య నుంచి రూ.8 వేల లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ హరిబాబును పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ కథనం ప్రకారం.. నాలుగు నెలల క్రితం కండిషన్ ప్రమోషన్‌పై కమ్మర్‌పల్లికి ఎంపీవో బాగయ్య బదిలీపై వచ్చి విధులు నిర్వర్తించారు. ఆయన ఇటీవలే ఇందల్వాయి మండలానికి బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి వర్ని మండలం చందూర్‌లో అటాచ్ డ్యూటీలో చేరారు. అయితే బాగయ్య బదిలీ అయినా.. ఆయన సర్వీస్ బుక్కు మాత్రం కమ్మర్‌పల్లిలోనే ఉండిపోయింది. దీంతో సర్వీస్ బుక్కు పంపాలని బాగయ్య పలుమార్లు అప్పటి ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని కలిశారు. అయితే ఆయన రూ.10 వేలు డిమాండ్ చేయడంతో రూ.8వేలు ఇస్తానని వేడుకున్నాడు. కాగా, ఇటీవలే ఎంపీడీవో సంతోష్‌రెడ్డి కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండల కేంద్రానికి బదిలీపై వెళ్లారు. దీంతో ఎంపీవో బాగయ్య కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సీనియర్ అసిస్టెంట్ హరిబాబును కలిశాడు. కానీ ఇదివరకు చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.8 వేలు ఇస్తేనే సర్వీస్ బుక్కు ఇవ్వాల్సిందిగా బదిలీపై వెళ్లిన ఎంపీడీవో టి. సంతోష్ రెడ్డి చెప్పారని, డబ్బులు ఇస్తేనే సర్వీస్ బుక్కు ఇస్తానని చెప్పాడు. దీంతో బాగయ్య చేసేదేమీ లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళికలో భాగంగా మంగళవారం సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు బాగయ్య రూ.8వేల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అలాగే భిక్కనూర్‌లో ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్‌రెడ్డిని కమ్మర్‌పల్లి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ డి. శేఖర్‌గౌడ్ సాయంత్రం విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భిక్కనూర్ ఎంపీడీవో టి. సంతోష్ రెడ్డిని ఏ-1గా, లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ హరిబాబును ఏ-2గా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



● కందకుర్తి బ్రిడ్జి ఇలా..

ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటి మట్టాలు

- ప్రాజెక్టులో ప్రస్తుతం 17టీఎంసీలే ఉన్న నీరు
- ఆయకట్టు చివరి తడి కోసం సాగు నీటి విడుదల
- మిగతా తాగునీటి అవసరాల కోసం వినియోగం
- కందకుర్తి దగ్గర గోదావరిలో తగ్గిన నీటి ప్రవాహం

నిజామాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో గణనీయంగా నీటినిలువలు తగ్గిపోయాయి. యాసంగి ఆయకట్టుకు చివరి తడిని అందిస్తున్న అధికారులు మిగతా నీటిని తాగునీటి కోసం నిలువ ఉంచేందుకు సిద్ధమవుతున్నారు. యాసంగిలో పంటలసాగు ఎక్కువ కావడం కాకతీయ కాలువ స్టేజీ-2 వరకు నీటిని విడుదల చేయడంతో భారీ ఎత్తున నీటి వినియోగం అయ్యింది. ఈ యాసంగిలో ఇప్పటి వరకు 61 టీఎంసీల నీటిని వినియోగించారు. ఈనెలాఖరు వరకు చివరి ఆయకట్టుకు నీటిని అందించి అవసరం మేరకు నీటిని వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టులో నీళ్లు తగ్గిపోవడంతో ఎడారిలాగా కనిపిస్తుంది. ప్రాజెక్టు ఎగువప్రాంతం కందకుర్తి గోదావరి వద్ద కూడా నీటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి.

ఆయకట్టుకు నీటి సరఫరాతో తగ్గిన నీళ్లు

యాసంగిలో భారీ ఎత్తున నీటి నిల్వలు ఉండగా పంటల సాగు పెరగడం ఆయకట్టు మొత్తానికి నీటి సరఫరా చేయడంతో నీళ్లు తగ్గాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1062.90 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 90 టీఎంసీలకు గాను 17.183 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. శ్రీరాంసాగర్ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసినప్పుడు ప్రాజెక్టులో 78 టీఎంసీల నీళ్లు ఉండేవి. డిసెంబర్ 18, 2023న యాసంగి ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగించారు. కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువల పరిధిలోని ఆయకట్టుకు ఈ నీటివిడుదలను కొనసాగించారు. వీటితో పాటు ప్రాజెక్టు పరిధిలో ఎత్తిపోతల పథకాలైన గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఆయకట్టుకు నీటిని అందించారు. వరద కాలువల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించారు. కాకతీయ స్టేజీ-1తో పాటు స్టేజీ-2 కింద కూడా యాసంగి ఆయకట్టుకు నీటి విడుదలను చేశారు. ఎల్‌ఎండీకి ఎగువన మొత్తం 9లక్షల ఎకరాల వరకు సాగునీటిని అందించారు. దిగువన కూడా నీటి విడుదల కొనసాగించారు. యాసంగిలో మూడు నెలల పాటు నీటిని విడుదల చేయగా ఇప్పటి వరకు 61 టీఎంసీల నీటిని పంటలకు వినియోగించారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని కాలువల ఆయకట్టులో వరిసాగు చేయడం వల్ల ఎక్కువ మొత్తంలో నీటి వినియోగం అయ్యింది. వేసవిలో ఎండలు పెరగడం భూగర్భ జలాలు అడుగంటడం వల్ల నీటివినియోగం ఎక్కువగా అయ్యింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 17 టీఎంసీలు ఉండగా ఆయకట్టుకు కాకతీయ కాలువ కింద చివరి తడి నీటిని అందిస్తున్నారు. ఈ నీటి విడుదలను ఈనెలాఖరు వరకు కొనసాగించనున్నారు. పంటలకు నీటి విడుదల పూర్తయిన తర్వాత ఉన్న నీటిని తాగునీటి కోసమే వినియోగించనున్నారు. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో తాగునీటి కోసం ఈ నీటిని వినియోగిస్తారు. ప్రభుత్వ ఆదేశాలను అనుగుణంగా వచ్చే జూలై వరకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండే విధంగా చర్యలను తీసుకుంటున్నారు. ఎండల వేడి పెరగడం ఏప్రిల్, మేలలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఏర్పడే అవకాశం ఉండటంతో ముందస్తుగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆయకట్టుకు నీటి విడుదల పూర్తయిన తర్వాతన గేట్లను మూసివేసి అవసరాల మేరకే తాగునీటిని విడుదల చేయనున్నారు. ఒకేసారి ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంతో బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎడారిని తలపిస్తుంది.



ఎడారిగా మారిన ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతం

ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడం వల్ల అధికారులు కూడా ఉన్న నీటిని పొదుపుగా వాడేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతం ఎగువన గోదావరి నదీ కూడా ఎండిపోతుంది. పై నుంచి నీళ్లు రాకపోవడం వల్ల నీటి నిల్వలు తగ్గిపోయాయి. గోదావరి వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల చేయడం వల్ల కూడా భారీగా తగ్గుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.



● ఎస్సారెస్పీ గేట్ల ఎదుట ఇలా..



‘పార్లమెంట్’కు నేతల సన్నద్ధం

- నిజామాబాద్, జహిరాబాద్ పార్లమెంట్ పరిధిలో సభలకు ఏర్పాట్లు
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ప్రచార బాధ్యతలు
- అగ్రనేతల భారీ బహిరంగ సభలకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు

నిజామాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా నేతలు పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అగ్రనాయకత్వం ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల పైనే బాధ్యత పెట్టడంతో రెండు పార్లమెంట్‌ల పరిధిలో భారీ ప్రచారాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు పార్టీలకు చెందిన అగ్రనేతలు ప్రచారాలకు హాజరుకానుండటంతో ప్రధాన పట్టణాలు, మండలాల్లో బహిరంగ సభలతో పాటు రోడ్‌షోలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ నేతలందరిని కలుపుకొని ప్రచారం నిర్వహించుకునేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల నేతలు రెండు పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులను ప్రకటించడంతో ఎన్నికల నోటిఫికేషన్ ముందే భారీ సభలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో గెలిచేందుకు మూడు పార్టీల నేతలు ప్రయత్నాలను చేస్తున్నారు.

ప్రచారాలకు నేతల కసరత్తు

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో నిజామాబాద్, జహిరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రచారాల కోసం ఉమ్మడి జిల్లా నేతలు సన్నద్ధమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే బీజేపీ సిట్టింగ్ ఎంపీనే అభ్యర్థిగా ప్రకటించగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. సామాజిక సమీకరణాల్లో భాగంగా కొద్ది రోజుల్లోనే ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. జహిరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌ను అభ్యర్థిగా ప్రకటించగా కాంగ్రెస్ మాజీ ఎంపీ సురేష్ శెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. బీఆర్‌ఎస్ వినోద్ కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో మూడు పార్టీల నేతలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ పరిధిలో కీలకమైన నియోజకవర్గాలు ఉన్నాయి.

పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాలు ఇక్కడే ఉన్నాయి. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాలు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉండగా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు జగిత్యాల జిల్లా పరిధిలో ఉన్నాయి. జహిరాబాద్ పార్లమెంట్ పరిధిలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉండగా జహిరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్నాయి. రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఉమ్మడి జిల్లానే కీలకంగా ఉంది. గెలుపు ఓటముల్లో కూడా ఉమ్మడి జిల్లా వాసులే ఈ రెండు పార్లమెంట్‌లో కీలకంగా ఉన్నారు. ఇక్కడి ఓటర్లు ఏ అభ్యర్థి వైపు ఎక్కువగా మొగ్గు చూపితే ఆ అభ్యర్థులే గెలిచే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న ఈ రెండు పార్లమెంట్ పరిధిలో స్థానికులకే ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని పార్టీ నేతలు భావించారు. జహిరాబాద్ పరిధిలో ఉమ్మడి జిల్లాకు చెందిన సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్‌కు అవకాశం ఇచ్చారు. సురేష్ శెట్కార్ కూడా పార్లమెంట్ పరిధిలో కావడంతో ఆయనకు కూడా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది. గతంలో ఎంపీగా చేయడం వల్ల ఆయన వైపే మొగ్గు చూపింది. అభ్యర్థిగా ప్రకటించింది. బీఆర్‌ఎస్ మాత్రం సిట్టింగ్ ఎంపీ బీజేపీలో చేరి అభ్యర్థిగా మారడంతో పటాన్‌చెరుకు చెందిన వినోద్‌కుమార్‌కు అవకాశం ఇచ్చింది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్థానికుడు కావడంతో ఆయనకే మరోదఫా అవకాశం కల్పించింది. బీఆర్‌ఎస్ కూడా జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు అవకాశం కల్పించింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. ఆ పార్టీ కూడా స్థానికులకే కేటాయించేందుకు సిద్ధమవుతోంది.

డీసీసీబీ చైర్మన్‌గా రమేష్‌రెడ్డి ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, మార్చి 26: డీసీసీబీ చైర్మన్‌గా కుంట రమేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో రమేష్‌రెడ్డిని డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ ఎన్నిక కోసం రమేష్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో.. ఆయన చైర్మన్‌గా ఎన్నికైనట్లు డీసీవో శ్రీనివాస్ ప్రకటించి, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రైతులకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా బ్యాంకు అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు ముప్ప గంగారెడ్డి, అంతిరెడ్డి రాజరెడ్డి తదితరులు రమేష్‌రెడ్డిని అభినందించారు.



రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

క్వింటాకు రూ.500 బోనస్ అదనంగా ఇవ్వాలి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి 26: రాష్ట్రంలోని గ్రామగ్రామాన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. వరికి క్వింటాలుకు ఎంఎస్‌పీ ధర కంటే రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఏం చెప్పారు, ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 110రోజులు దాటిన ఇప్పటి రైతులకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఒక వైపు బ్యాంకు అధికారులు రైతులకు అప్పులు కట్టాలని లీగల్ నోటీసులు ఇస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు ఎందుకు వేయలో రైతులు ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయని, సాగునీరు సరిగ్గా అందక బోర్లు ఎత్తిపోతున్నాయన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తే రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, జడ్పీటీసీ తలారి గంగాధర్, పడిగెల సొసైటీ చైర్మన్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

పౌరహక్కుల సంఘ నేత నాగేశ్వర్‌రావు కన్నుమూత

● నేడు కొత్తపల్లిలో అంత్యక్రియలు

నందిపేట, మార్చి 26: పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ముప్వ నాగేశ్వర్‌రావు (89) మంగళవారం తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా ఆయన అస్వస్థతకు గురై ఊపిరితిత్తుల వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు తన స్వగ్రామమైన మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి తీసుకొచ్చి వెంటిలెటర్‌పై ఉంచారు. మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ముప్వ నాగేశ్వర్‌రావు ప్రస్థానం భీమ్‌గల్ మండల కేంద్రంలో ఉపాధ్యాయుడిగా మొదలైంది. జిల్లాలోని నందిపేట, బోదన్, నవీపేట, మాక్లూర్ మండలాల్లో తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించారు. కుద్వాన్‌పూర్‌లో గజిటెడ్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. ముప్వ నాగేశ్వర్‌రావు పలుసార్లు పౌరహక్కుల సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసి ప్రజల హక్కులు, ప్రజా సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేశారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీయుటీఎఫ్) ఫెడరేషన్‌లో జిల్లా, రాష్ట్ర కార్యవర్గంలో పని చేసి ఉపాధ్యాయుల హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షుడిగా నిజాంసాగర్ ఆయకట్టు రైతుల సమస్యలపై ఇతర ప్రజా ఉద్యమాలపై ప్రజలకు చేదోడు వాదోడుగా నిలబడి పోరాటం చేశారు. ముప్వ నాగేశ్వర్‌రావు పార్థీవదేహాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్, జిల్లా నాయకులు గంగాధర్, రవీందర్, కుమార్, చిట్టెన్న, బీకోసింగ్, రాజేశ్వర్, బావన్న సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని మెడికల్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మెడికల్ కళాశాలకు కుటుంబసభ్యులు అందజేయనున్నారు. ముప్వ నాగేశ్వర్‌రావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం మాక్లూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



నాగేశ్వర్‌రావు (ఫైల్)



ముప్వ నాగేశ్వర్‌రావు పార్థివ దేహం

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

బోధన్ రూరల్, మార్చి 26 : అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంజీర పరివాహక ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. రాత్రి వేళ ఇసుక రవాణా నిషేధమని, ఇసుక అక్రమ రవాణా చేస్తే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పగటి పూట మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఉంటేనే ఇసుక రవాణా చేయాలని సూచించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ



సాలూర చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు బలగాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కోల నరేష్ మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వచ్చే వాహనాలను తనిఖీలు చేపడుతున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెద్ద ఎత్తున డబ్బులు ఎవరూ ఇతర పనుల మీద తీసుకెళ్లవద్దన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. బోధన్ నుంచి మహారాష్ట్ర వెళ్లే వాహనాలను సైతం తనిఖీలు చేపడుతున్నారు. రాకపోకల వారి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. బోధన్ తహసీల్దార్ గంగాధర్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తదితరులు ఉన్నారు.

పొతంగల్ చెక్‌పోస్టులో నగదు పట్టివేత

కోటగిరి,మార్చి26: పొతంగల్ మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.2లక్షల 29వేల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎన్నికల వేళ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వస్తున్న అనే ఒక బైక్ వద్దగల వాహనాన్ని తనిఖీ చేశారు. నాందేడ్ జిల్లా ఉన్‌గుండకు చెందిన నగేష్ షెట్కార్ అనే వ్యక్తి రూ.2.29లక్షల నగదు ఉండడంతో వివరాలు అడిగారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడంతో నగదును సీజ్ చేసి బాన్సువాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామన్నారు. వాహనదారులు రూ.50వేల కన్న ఎక్కువ డబ్బులతో ప్రయాణిస్తే సరైన పత్రాలు ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు.



పొతంగల్ చెక్‌పోస్టులో నగదు పట్టుకున్న దృశ్యం

రైతు వేదికల నిర్వహణ ముందుకు సాగేదెలా?



సాలూరలోని రైతు వేదిక

● నిధులు రాక నిర్వహణకు తప్పని తిప్పలు
● ఏడాదిగా నిధులు రాక నిర్వహణకు ఇబ్బందులు పడుతున్న వైనం

బోధన్ రూరల్, మార్చి 26: రైతు వేదిక నిర్వహణ ముందుకు సాగడం ప్రశ్నార్థకంగా మారింది. ఏడాది కాలంగా రైతు వేదికల నిర్వహణకు నిధులు రాక నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాహణకు నిధులు రాకపోవడంతో ఏఈవోలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని రైతు వేదికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నెలనెలా వచ్చే నిధులు ఏడాదిపైగా రాకపోవడంతో రైతు వేదికల నిర్వహణ సరిగ్గా సాగడం లేదు. బోధన్ డివిజన్‌లో 22 రైతు వేదికలు ఉండగా జిల్లా మొత్తంలో 106 రైతు వేదికలు ఉన్నాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు రాకపోవడంతో విస్తరణ అధికారులకు పెనుభారంగా మారింది. రైతులు నిరంతరం సమావేశాలు నిర్వహించుకుని పంటల సాగు, కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా జిల్లాలో రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా 106 రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేలా రైతు వేదికల్లో వసతులు కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్‌సెట్‌ల వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతో పాటు రైతుల తోడ్పాటుతో కొన్ని చోట్ల అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకున్నారు. వీటిలో సీజన్ వారీగా పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికల్లో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. రైతు వేదికలు కొన్ని గ్రామాలకు దగ్గరగా ఉండగా, మరికొన్నింటిని దూరంగా నిర్మించారు. వీటిలోనే క్లస్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఒక్కో రైతు వేదికను సుమారు రూ.22 లక్షలతో నిర్మించారు. వాటి నిర్వహణకు మొదట నిధులు కేటాయించారు. రైతు వేదికలను నిత్యం శుభ్రం చేసేందుకు విద్యుత్ చార్జీలు, తాగునీటి కోసం స్టేషనరీ మరమ్మతుల కోసం నెలకు రూ.9,500 కేటాయించింది. రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. 2022 ఆగస్టు వరకు ప్రతినెలా రూ.9,500 చొప్పున గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో ఏఈవోలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఒక్కో రైతు వేదికలో విద్యుత్ చార్జీలు ప్రతినెల చెల్లించకపోవడంతో వేలల్లో బకాయిలుగా మిగిలిపోయాయి. డబ్బులు విడుదల చేయాలని గత ప్రభుత్వానికి కూడా విన్నవించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

● కొత్త ప్రభుత్వం... రైతు నేస్తం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగానే రానున్న సీజన్‌లో రైతు వేదికల్లో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై శాస్త్రజ్ఞులతో రైతులకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఏఈవోలు గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామ పంచాయితీ కార్యాలయాలను వినియోగించుకునే వారు. రైతులకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించడం వల్ల వాటిని వ్యవసాయ క్లస్టర్ కార్యాలయాలుగా వినియోగించుకుంటున్నారు. ఈ వేదికల వల్ల ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వాటి నిర్వహణకు సంబంధించి నెలనెల ఇవ్వాల్సిన డబ్బులు అందకపోవడంతో శుభ్రం చేయడం, తాగునీటి కోసం ప్రస్తుతం ఏఈవోలు సొంతంగా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా రైతు వేదికల నిర్వహణకు డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఏడాదికిపైగా డబ్బులు రావడం లేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. రైతు వేదికల నిర్వహణ డబ్బులు రాకపోవడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-వాజీద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

టీయూలో క్రీడా పోటీలు ప్రారంభం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణయూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని క్రీడా పోటీలను టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. ఓటమిని గెలుపుగా స్వీకరించి ముం దుకు సాగితే విజయం తథ్యమని కాంట్రాక్ట్ అధ్యాపకులు డా.దత్తహరి అన్నారు. ఎన్ఎస్ యూఐ వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నమని స్నేహభావం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీనివాస్,ఎన్ఎస్‌యూఐ నాయకులు రాజేందర్, సాగర్ నాయక్, నిరంజన్, శ్రీకాంత్, విజయ్, అశ్విన్, అనిల్, నవీన్, అనిల్ నంద, పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం


మోర్తాడ్ బస్టాండ్‌లో శుభ్రం చేస్తున్న కళాశాల విద్యార్థులు

మోర్తాడ్, మార్చి26: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రమదానం నిర్వహించారు. బస్టాండ్‌లో ప్రజలకు ప్లాస్టిక్ వల్ల నష్టాలు, దుష్పరిణామాల గురించి వివరించారు. వ్యర్థాలను గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్తకుండిలో వేయాలని, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరు చెత్తకుండీలో వేయాలని సూచించారు. గుట్కా, పాన్‌దార్ల వంటిని బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయవద్దని వివరించారు. వేసవికాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారి భూపతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులకు రుణాలు, ఎరువులు అందిస్తున్నాం'

ఏర్గట్ల, మార్చి 26: సొసైటీ పరిధిలోని రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలను అంద జేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘ మహాజన సభను సంఘ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య అధ్యక్షతన నిర్వహించగా కార్యదర్శి శ్రీనివాస్ ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. రైతులు తమ రుణాలు కట్టి కొత్త రుణాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సింగసారం గంగారాం, బద్ధం ప్రభాకర్, కొలిప్యాక శ్రీనివాస్, బద్ధం హన్మండ్లు, రేండ్ల రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంసీ కళాశాల వద్ద లిక్కర్ పట్టివేత

డిచ్‌పల్లి, మార్చి 26: డిచ్‌పల్లి సీఎంసీ కళాశాల, దేవపల్లి రోడ్డు అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతి లేకుండా కొత్తపల్లిసందీప్ 54.6లీటర్లలిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.పట్టుకున్న లిక్కర్‌విలువ 13,650రూ.ఉంటోందని సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

రెంజల్,మార్చి26: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన రాము గత కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మంగళవారం బాధితుడు రాముకు ఎస్ఐ సాయన్న అందజేశారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్‌లు మిస్ అయితే సీఈఐఆర్ పోర్టల్‌లో తమ యొక్క వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేష్ ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● డీఎస్పీ నాగేశ్వర్


దోమకొండలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దోమకొండ, మార్చి 26:పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించేందుకు డీఎస్పీ నాగేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలతో పోలీసులు ప్రధాన వీధుల గుండా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన చర్యలు తప్పవని సందేశం ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించువాలన్నారు. కార్యక్రమంలో భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, ఎస్సై గణేష్, బీబీపేట ఎస్సై ప్రభాకర్,ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్‌లను ఏర్పాటు చేయాలి


ప్రమాద సూచికలను పరిశీలిస్తున్న సీఐ సంపత్

దోమకొండ, మార్చి 26: దోమకొండ మండల పరిధిలోని అంచనూర్, సంగమేశ్వర్, అంబార్‌పేట గ్రామాల పరిధిలో ప్రమాదాలు జరిగేచోటును సీఐ సంపత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రమాదకర, మూలమాలుపుల స్థలాల్లో వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదకర, మూలమాలుపుల స్థలాలో రేడియం స్టిక్కర్‌లను ఏర్పాటు చేయాలని ఎస్సైకి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ ఎస్సై గణేష్, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, నల్లపు శ్రీనివాస్, రాంరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ఎరువుల డీలర్‌లు ఈ-పాస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరపాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్


మోర్తాడ్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారివాజీద్‌హుస్సేన్

మోర్తాడ్, మార్చి26: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. మండలంలోని ఎరువుల దుకాణాలను, ఎరువుల నిల్వలను ఈపాస్ మిషన్, భౌతిక నిల్వలతో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎరువులు, క్రిమిసంహరక మందుల డీలర్‌లు మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. ఎవరైన ఈ-పాస్ ద్వారా కాకుండా అమ్మకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఏవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయాధికారి లావణ్య, ఎరువుల డీలర్‌లు పాల్గొన్నారు.

ముస్లిం నిరుపేదలకు నిత్యావసర సరకుల పంపిణీ


కమలపూర్ నర్సరీలో నిత్యావసర సరకులను అందజేసిన అటవీశాఖాధికారి

డిచ్‌పల్లి, మార్చి 26: ఇందల్వాయి అటవీ శాఖ అధికారి సుబ్బరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం కమలాపూర్ ఫారెస్ట్ సెంట్రల్ నర్సరిలో పని చేసే 13మంది నిరు పేద మైనార్టీ కుటుంబాలకు రంజాన్ సందర్భంగా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరావు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారం ప్రతి యేటా అందజేస్తానని, గతంలో తన తల్లి మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ ని తాను కొనసాగిస్తున్నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారిని సాయిదీప్తి, సిబ్బంది హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ విద్యార్థులకు నెట్ ఫెలోషిప్ ఇవ్వాలి

డిచ్‌పల్లి, మార్చి 26: ఓబీసీ పరిశోధన విద్యార్థులకు, అధ్యాపకులకు, ఓబీసీ నెట్ ఫెలోషిప్ సంఖ్యను 1000 నుంచి 5 వేలకు పెంపు చేయాలని ఐసీఎస్ఎస్ఆర్ రిసార్చ్ నిధుల ద్వార జరిగే ప్రాజెక్టుల్లో ఫెలోషిప్‌లో ఓబీసీ కోటను అమలు పర్చకపోవడంతో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు వినతి పత్రం అందజేసినట్లు లక్ష్మీనారా యణ తెలిపారు. ఇందుకు బండి సంజ య్ సానుకులంగా వ్యక్తం చేసినట్లు పే ర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో రా మ్, గణేశ్,పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

బీపీఎడ్ 1,3వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్షకు 81మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరయ్యారని, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 1వ సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, మార్చి 26: తెలంగాణ యూనివర్సిటీలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల తేదీలు సీవోఈ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించేందుకు ఏప్రిల్ 1 వరకు గడువు ఉండగా అపరాధ రుసుముతో ఏప్రిల్ 4వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.600, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కళా శాలలో సంప్రదించాలని, మరిన్ని వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదిం చాలని సూచించారు.

గుర్తుతెలియని శవం లభ్యం

మాక్లూర్, మార్చి26: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మోరా చెరువులో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైయిందని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మృతునికి 40ఏళ్ల ఉండవచ్చని చెరువులో చనిపోయి మృతదేహం పైకి తేలిందని అన్నారు. మృతుడు ఎరుపు, నలుపు గీతలతో కూడిన షర్టు, బ్లూ కలర్ నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ కోసం మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

యూత్ వెల్ఫేర్, డైరెక్టర్ కల్చరల్ యాక్టీవిటీస్‌గా లావణ్య నియామకం

డిచ్‌పల్లి, మార్చి 26: తెలుగు అధ్యాయన శాఖ ప్రొఫెసర్ కరిమిల్ల లావణ్యకు డైరెక్టర్ కల్చరల్ యాక్టీవిటిస్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామిస్తూ నియామక ఉత్తర్వులు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి ఉత్తర్వులు అందజేశారు. గతంలో లావణ్య బాలికల వసతి గృహం వార్డెన్, పరీక్షల విభాగం అదనపు క ంట్రోలర్ గా, ఉమెన్ సెల్ డైరెక్టర్, పబ్లికేషన్ సెల్ డైరెక్టర్,దక్షిణ ప్రాంగణ ప్రిన్సి పా ల్, తెలుగు అధ్యా యన శాఖ అధ్య క్షుడు, పాఠ్య ప్రణా ళిక సంఘం అధ్య క్షుడిగా సమర్థవం తంగా పనులు నిర్వర్తించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం

ఆర్మూర్‌రూరల్, మార్చి26: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన లావణ్య శ్రీనివాసును మంగళవారం ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠ శాలల అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్యప్రవీన్ పవార్‌లు సన్మానించారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంతి గంగారెడ్డి, మానస గణేష్, గోపికృష్ణ, నలంద ప్రసాద్, వంశీప్రజ్ఞ, ఆలూర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సాగిన మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్

బోధన్ రూరల్, మార్చి 26 : బోధన్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్‌లు లేకపోవడంతో సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీటీసీ సభ్యులు కొన్ని గ్రామాలలో బోర్లలో నీళ్ళు తగ్గడంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందని వాపోయారు.ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇండ్ల నిర్మాణం, ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఉన్నా అధికారులకు అడిగిన ఇవ్వడం లేదని, ఎన్నికల కోడ్ ఉందని అధికారులు తెలుపుతున్నారని ఎంపీపీ అన్నారు. బహిరంగ మార్కెట్‌లో టన్నుకు రూ.1200 రేటు పలుకుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పీహెచ్‌సీలలో చిన్న పిల్లలకు సంబంధించిన కొన్ని టీకాలు ఉండటం లేవని, జిల్లా వైద్య అధికారులు అన్ని సబ్ సెంటర్‌లలో మందులు ఉండే విధంగా చర్యలుతీసుకో వాలని ఎంపీపీ సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీవో జగదీష్ జాదవ్, బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో మధుకర్,ఎంపీటీసీ సభ్యులు, సహకార సంఘం చైర్మ న్‌లు, గ్రామపంచాయితీ ఇన్‌చార్జీఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి రావాల్సిన వేతనాలు చెల్లించాలి

బోధ న్ రూరల్, మార్చి 26: బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు వైద్య సిబ్బందికి మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్య సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్‌కు 6వ తేదిన సమ్మె నోటీసు ద్వారా తెలియజేసినా స్పందించడం లేదని, వేతనాలు ఇవ్వకపోవడంతో సమ్మె నిర్వహించి నిరసన తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్య సిబ్బందికి రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, నాగమణి, సతీష్, జాఫర్, మాధవి, సాయిలు, దత్తు, కార్మికులు తదితరులు ఉన్నారు.



బోధన్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డ్రైనేజీ నీటితో పాఠకులకు అవస్థలు

ఆర్మూర్‌టౌన్, మార్చి26: పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయ ఆవరణలో లైబ్రరీలో డ్రైనేజీ వ్యవస్థతో పాఠకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లైబ్రరీలో ఉన్న టాయిలెట్ రూం నీరు బయటకు వెళ్ళకుండా పైప్‌లైన్ చెడిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. దీంతో పాఠకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ వ్యవస్థను బాగుపరిచి పాఠకులకు ఏలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రియో డ్రైవ్ ఇన్ పరిశీలన

డిచ్‌పల్లి, మార్చి 26: బర్దిపూర్ శివారులో గల రియో డ్రైవ్ ఇన్ లో హోళీ పర్వదినం సందర్భంగా పోలీసులు తనిఖీలు చేయగా ఎలాంటి మద్యం లభించలేదని ఎస్సై మహేశ్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు కొనసాగించాలని ఎస్సై సూచించారు.

తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఏర్గట్ల, మార్చి 26: మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు తాగు నీటి సమస్యలు ఎదుర్కొకుండా నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని డీ ఎల్‌పీవో శివకృష్ణ ప్రత్యేకాధికారులకు, కార్యదర్శులకు సూచించారు. మంగళ వారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో డీఎల్‌పివో శివకృష్ణ మాట్లాడుతూ మండలంలోని అన్ని జీపిలు వంద శాతం ఇంటి పన్నుల వసూలు చేయాలని, నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం ఇంటి పన్నులపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొనగా రూ.78వేల600 వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివ చరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్గుల్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి26: మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం ప శువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. గ్రామంలో సుమారు 996 పశు వులు, ఆవులకు కలిపి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీచైర్మన్ రాజా రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగేలా చూడాలి

- ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి కొనుగోలు కేంద్రాలు
- సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 26: యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ లో మంగళవారం ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలు, ఐకేపీ సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని యాసంగిలో జిల్లాలో సాధారణానికి మించి అధిక విస్తీర్ణంలో వరి పండించారని, 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో 462 కొనుగోలు కేంద్రాల ద్వారా 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించామని వీటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 417, ఐకేపీ ద్వారా 39, మెప్మా ద్వారా 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రాలలో ధాన్యం ఏగ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 ధర చెల్లించేలా చూస్తామన్నారు. సమావేశంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి గంగుబాయి, సహకార శాఖ అధికారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖిల్లా, మార్చి 26: రోడ్డు నిబంధనలు పాటించి ఆటోలు నడపాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని ఆటో డ్రైవర్లకు న్యూ అంబేద్కర్ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆటో నడిపే డ్రైవర్లు యూనిఫాం ధరించి ఆటో నడపడం గౌరవంగా భావించాలన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, లైసెన్సులు లేనివారికి ఆటోలు అద్దెకు ఇవ్వరాదని ఆయన సూచించారు. మద్యం తాగి వాహనం నడుపరాదన్నారు. ఓవర్ లోడ్‌తో ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవదని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఆటోలకు నంబర్లు లేకుండా నడపరాదని, తప్పనిసరిగా ఆటోనంబర్ కనిపించేలా చూసుకోవాలన్నారు. ఏసీపీ ఎల్.రాజ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లపై ఆటోలు నిలిపి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. కార్యక్రమంలో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారయణ, టౌన్ సీఐ బి.నరహరి, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'టెట్' ఫీజును తగ్గించాలి

సుభాష్‌నగర్, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు ఫీజులను తగ్గించాలని ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండి పరీక్ష ఫీజు లేకుండానే పరీక్షలు నిర్వహించాలని నిజామాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టు కావడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు బొబ్బ నర్సింహారావు, కోయేడి నర్సింలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం

ధర్పల్లి, మార్చి 26: చిరు ధాన్యాలు ఆహారంగా తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోషన్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పదార్థాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని 30 మంది గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఆహారంలో పోషక పదార్థాలు ఉండే విధంగా చూడాలన్నారు. చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గర్భిణీలకు, బాలింతలకు అంగన్‌వాడి సెంటర్‌లలో పౌష్టికాహారం అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు ఆటపాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఎండీవో బాలకిషన్, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'లార్వా' సర్వే పరిశీలన

మోస్రా, మార్చి 26: ఉమ్మడి మండలంలోని పొట్టిగుట్ట తండాలో ఉప డీఎంహెచ్‌వో విద్య మంగళవారం లార్వా సర్వేను పరిశీలించారు. తండాలో సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడ హెల్త్‌క్యాంప్ కొనసాగించాలని ఆమె ఆదేశించారు. దోమల ద్వారా మలేరియా, చికెన్ గున్యా లాంటి జ్వరాలు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్, సూపర్‌వైజర్ మేరీ, సాయమ్మ, ఏఎన్ఎంలు, ఆశలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గీతా' కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కోటగిరి, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంఘాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినట్లే గీత కార్మికులకు గీత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కామ్రేడ్ ధర్మభిక్షం 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు శ్రీధర్ గౌడ్, వెంకాగౌడ్, పండరి గౌడ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవీపేట, మార్చి 26: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిన 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు కూతురి వివాహానికి మంగళవారం సాయంత్రం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని అభంగపట్నంకు చెందిన బుచ్చయ్య నవీపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1985-86 బ్యాచ్‌లో చదువుకున్నాడు. బుచ్చయ్య కుమార్తె స్నేహ వివాహం బుధవారం జరగనుంది. తమ స్నేహితుడు పేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో పూర్వ విద్యార్థులు రూ.30వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. తన కుమార్తె వివాహానికి సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులకు బుచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు!

- అభివృద్ధికి నోచుకోని ఎడపల్లి వార సంత
- నిరుపయోగంగా చేపల మార్కెట్, కూరగాయల షెడ్లు
- వారసంత తై బజార్ వేలం పాటలో ఏటా లక్షల్లో ఆదాయం
- అయినా పట్టించుకోని పాలకులు, అధికారులు


నిరుపయోగంగా కూరగాయల మార్కెట్ షెడ్లు


ప్రారంభానికి నోచుకోని చేపల విక్రయ కేంద్రం

ఎడపల్లి, మార్చి 26: మండల కేంద్రంలో కూరగాయల సంత ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎలాంటి మార్పు కనిపించడంలేదు. గత పాలకులకు సంతలో వచ్చే ఆదాయంపై ఉన్న ఆసక్తి సమస్యలపై కనిపించలేదు. మరోవైపు రూర్బన్ పథకంలో చేపల మార్కెట్‌కు రూ.50 లక్షలు, కూరగాయల షెడ్లు రూ.50 లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఎడపల్లి మండలాన్ని 2017వ సంవత్సరంలో రూర్బన్ పథకానికి ఎంపిక చేసి నిధులను మంజూరు చేశారు. ఆ నిధుల నుంచి లక్షలు వెచ్చించి సంతలో కూరగాయలు, మాంసం, చేపల విక్రయానికి షెడ్డుల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు వాటిని వినియోగించుకోక పోవడంతో షెడ్డులు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

ప్రతి మంగళవారం సంత

మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే కూరగాయల సంతలో సమస్యలు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టక పోవడంతో సంతకు వచ్చే ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంత ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇంకా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఆదాయంపై ఉన్న ఆసక్తి సమస్యలపై లేదు

మంగళవారం జరిగే సంతకు తైబజారు వేలం పాటలో ప్రతి సంవత్సరానికి రూ.6 నుంచి 8 లక్షల వరకు గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. వేలంలో వచ్చిన డబ్బులతోనైనా సంతలో అభివృద్ధి పనులు చేపట్టినా సమస్యలు తీరేవి. కానీ పాలకులు, అధికారులు సంత ఆదాయం పైనే ఆసక్తి చూపుతున్నారు తప్ప, సంత సమస్యలపై చూపించడం లేదు.

సంతలో తరచూ దొంగతనాలు

మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే సంత దొంగతనాలకు అడ్డాగా మారింది. పోలీసు స్టేషన్ పక్కనే సంత ఉన్నా ప్రతివారం ఏదో ఒక దొంగతనం జరుగుతూనే ఉంది. సంతలో మొబైల్ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలో సంత ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎందరో పాలకులు మారినా సంతలో ఉన్న సమస్యలపై దృష్టి సారించలేరు. సంతలో ఉన్న సమస్యలను పట్టించుకున్న పాపానా పోలేదు. పాలకులలో ఏ ఒక్కరూ సంతలో సమస్యల గురించి పట్టించుకున్నా సమస్యలు తీరేవి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, పోలీసులు స్పందించి సంతలో ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

షెడ్లను వాడుకలోకి తేవాలి..

: కంజర్ చంద్రకాంత్, గ్రామస్థుడు



ఎడపల్లి సంతలో నిర్మించిన షెడ్లతో మార్కెట్ స్థలం ఇరుకుగా మారింది. కూరగాయల షెడ్డు, చేపల, మాంసం విక్రయ కేంద్రాలు నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయి. అందులో వ్యాపారులు కూర్చోకపోవడంతో కొద్దిగా ఉన్న స్థలంలోనే మార్కెట్ జరగడంతో రద్దీ ఎక్కువవుతోంది. అధికారులు చొరవ తీసుకుని షెడ్లను వాడుకలోకి తీసుకరావాలి.

పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు..

: జనగం సంతోష్ రెడ్డి, గ్రామస్థుడు



ఎడపల్లి, మంగల్‌పాడ్, వడ్డాపల్లి, అంబం, ఏఆర్పీ క్యాంపు, ధర్మారం, జైతాపూర్ తదితర గ్రామాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలలో మార్కెట్‌కు వస్తారు. పార్కింగ్ స్థలం లేక వాహనాలను బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపైనే నిలపాల్సి వస్తుంది. దీనికి తోడు మార్కెట్‌ను ఆనుకుని రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాల యజమానులు తమ షాపుల ముందు వాహనాలను నిలుపనివ్వడం లేదు.

షెడ్లను వినియోగంలోకి తెస్తాం..

: నాగరాజు గౌడ్, పంచాయతీ కార్యదర్శి



మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో నిర్మించిన చేపల మార్కెట్‌ను, కూరగాయల షెడ్డును వినియోగంలోకి తెస్తాం. వాటిలోకి ప్రజలు ఎవరూ కూరగాయలు కొనడానికి రావడంలేదని వ్యాపారులు అందులో కూర్చోవడంలేదు. వ్యాపారులకు, ప్రజలకు వాటిపై అవగాహన కల్పించి వాటిలో మార్కెట్ జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆర్అండ్‌బీ స్థలంలో దుకాణాల ఏర్పాటుతో పార్కింగ్ సమస్య తలెత్తింది.

పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా

- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 26: యాసంగిలో రైతులు పండించిన వరిధాన్యం సేకరించేందుకు ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం నిలువలు రాకుండా గట్టి నిఘా ఉంచుతామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపడుతున్న చర్యలను సీఎస్‌కు వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం నిలువలు రాకుండా గట్టి నిఘా కొనసాగిస్తామని పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో నాలుగు అంతర్రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని ఈ చెక్‌పోస్టుల ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలో ప్రవేశించకుండా కట్టడి చేస్తామన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ మొదటి వారంలోపు ఎట్టి పరిస్థితుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలని ఎలాంటి తప్పిదాలకు, నిర్లక్ష్యానికి తావులేకుండా రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీశ్, జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియకు స్వీకారం

నిజామాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లో ఎన్ఐసీ హాల్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీవో), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవో)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వు సిబ్బందిని కలుపుకొని జిల్లా పరిధిలోని ఆరు సెగ్మెంట్‌లకు గాను మొత్తం 7,711 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. ఇందులో పీవోలు 2,008, ఏపీవోలు 2056, ఓపీవోలు 3647 మంది ఉన్నారు. పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, సీపీవో మల్లికార్జున్, శ్రీకాంత్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సదుపాయాలపై సమీక్ష

నిజామాబాద్ అర్బన్, మార్చి 26: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు, పిల్లలకు అందిస్తున్న సేవలపై అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమ నిర్వహణకు సమన్వయ సమావేశం నిర్వహించారు. మార్చి 9నుంచి 23 వరకు అంగన్‌వాడి కేంద్ర స్థాయి, మండల, ప్రాజెక్టు స్థాయిలలో జరిగిన కార్యక్రమాలను పిల్లలకు అందిస్తున్న సేవలపై ఆయన సమీక్షించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి రసూల్‌బీ, వైద్యాధికారి సుదర్శనం, సమగ్ర శిక్షా అభియాన్ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


అలీసాగర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, మార్చి 26: బోధన్ నియోజకవర్గ ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులోగల అలీసాగర్ రిజర్వాయర్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలీసాగర్‌లో 4 అడుగుల మేర నీరు తక్కువగా ఉందని నాలుగైదు రోజుల్లో అలీసాగర్‌కు నిజాంసాగర్ నుంచి బోధన్ నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నీరు విడుదల కానుందని, ఆ నీటితో అలీసాగర్ రిజర్వాయర్‌ను నింపుతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జడ్పీ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, నాయకులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు చేపడుతున్నాం..

బోధన్ రూరల్: నియోజకవర్గ ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తు చర్యలు, ప్రణాళికలు చేపడుతున్నామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని బెల్లాల్ చెరువును ఆయన పరిశీలించారు. చెరువులో ఉన్న నీటి సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టు అధికారితో ఫోన్‌లో మాట్లాడి బెల్లాల్ చెరువుతో పాటు అలీసాగర్ ప్రాజెక్టును నింపేందుకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు ఉన్నారు.

మెడికల్ కళాశాలకు నాగేశ్వర్‌రావు మృతదేహం

పెద్దబజార్, మార్చి 26: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సభ్యుడు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వర్‌రావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామమైన తన ఇంట్లో ఉదయం మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బుధవారం అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు శరత్, సురేష్‌లు తెలిపారు. వామపక్ష ఉద్యమాలకు మొవ్వ నాగేశ్వర్ రావు మృతి తీరనిలోటని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య అన్నారు.

నగరంలో నగదు పట్టివేత

ఖిల్లా, మార్చి 26: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఐటీఐ ప్రాంతంలో మంగళవారం రూ.8లక్షల 34వేల నగదును పట్టుకున్నట్లు రెండవ టౌన్ ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. నగర సీఐ బి.నరహరి నేతృత్వంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వాహనాలు తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న కాటిపల్లి రవీందర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన బ్యాగును తనిఖీ చేయగా అందులో నగదు లభించిందన్నారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల కోసం ఆదాయపన్నుల శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

ఖిల్లా, మార్చి 26: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎ.నారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ నేతృత్వంలో సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా 12 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారన్నారు. వీరిని కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం కోర్టులో మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట హాజరుపర్చగా వీరిలో 10 మందికి 11,300 రూపాయలు జరిమానా విధించడంతో పాటు కురం బాలకృష్ణ, గుండ అర్జున్‌లకు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

మోపాల్, మార్చి 26: మాధవనగర్ సాయిబాబా ఆలయంలో మంగళవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఈవో రాంరవీందర్ సమక్షంలో హుండీ లెక్కించారు. మూడు నెలలుగా ఆలయానికి వచ్చిన హుండీలో లక్షా 92వేల 549 రూపాయలు వచ్చినట్లు ఈవో రవీందర్ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది గంగాధర్, హరితరాణి, మానిక్‌శర్మ, సంతోష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.235	రూ. 275



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.67,900	రూ.62,600	రూ.680

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : సైతాన్ (హిందీ) (12.50)
: ఓం భీమ్ భుష్ (3.50, 10.15)
: ప్రేమలు (7.00)
స్ర్కీన్-2 : ప్రేమలు (1.30)
: కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (5.10, 7.30)
: సైతాన్ (హిందీ) (9.50)
స్ర్కీన్-3 : యమధీరా (1.10)
: యోధా (హిందీ) (4.10)
: ఈరోజుల్లో (7.10)
: లైన్‌మెన్ (10.00)
స్ర్కీన్-4 : రజాకర్ (12.05, 6.30, 9.45)
: గామి (3.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఓం భీమ్ భుష్ (1.45, 7.30, 10.30)
: ప్రేమలు (4.30)
స్ర్కీన్-2 : రజాకర్ (10.25, 4.30)
: భీమా (1.30, 7.40)
: ప్రేమలు (10.30)
స్ర్కీన్-3 : రజాకర్ (1.40, 7.40, 10.40)
: భీమా (4.40)

దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : నువ్వు నేను (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్